www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 1 నవంబర్ 2025

5



ఉద్యోగావకాశాల కల్పనే జాబ్‌మేళా లక్ష్యం

ప్రజాశక్తి - అమలాపురం

జాబ్ మేళాల ద్వారా ఐటి రంగంలో అవకాశాలను అన్వేషించే యువతకు నిర్దేశిత సమయంలో తగిన ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రధాన లక్ష్యమని కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. వికాస ఆధ్వర్యంలో ఐటి కంపెనీల సహకారంతో మినీ జాబ్ మేళా నిర్వహిస్తామని అన్నారు. నవంబర్ 4వతేదీన స్థానిక కలెక్టరేట్ ప్రాంగణం నందు గల వికాస కార్యాలయంలో మినీ జాబ్ మేళా నిర్వహిస్తామని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలోని 30 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన మహిళా అభ్యర్థులు మీ యొక్క విద్యార్హతలు బయోడేటాతో హాజరు కావాలని వికాస జిల్లా మేనేజర్ జి.రమేష్‌ను సహాయకులు రవితేజలను సంప్రదించాలని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు.

శిథిలావస్థలో బాలుర హాస్టల్

- కూలడానికి సిద్ధంగా ఉన్న 1979 నాటి భవనం
- మౌలిక వసతులు లేక విద్యార్థుల అవస్థ
- పలువురికి చర్మ వ్యాధులు
- వసతులు కల్పించాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం నియోజకవర్గంలోని 6 సంక్షేమ హాస్టల్స్ ఉన్నాయి. వీటిలో రామచంద్రపురం బాలుర వసతి గృహం 1979లో నిర్మించారు అప్పటి నుంచి ఈ భవనం ఇప్పటి వరకు సేవలు అందిస్తుంది. గత ఐదు ఏళ్లుగా భవనం శిథిలావస్థకు చేరుకుని వర్షం నీరు లీక్ అవుతోంది. దీనిపై పలుమార్లు ఫిర్యాదులు అందినప్పటికీ చర్యలు తీసుకున్న దాఖలాలు లేకపోవడంతో విద్యార్థులు ఇక్కట్లకు గురవుతున్నారు. దీంతో పాటుగా హాస్టల్ భవనం తలుపులు కిటికీలు పూర్తిగా పాడయ్యాయి. దీంతో ఈగలు దోమలు స్వైరవిహారం చేస్తున్నట్లు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో ఈ యాడాది తెరిచి ఐదు నెలలు కావస్తున్న ఇంకా దుప్పట్లు అందకపోవడంతో హాస్టల్ విద్యార్థులు ఇక్కట్లు గురవుతున్నారు.కాలేజీ విద్యార్థులు 58 మంది స్కూల్ విద్యార్థులు 56 మంది ఇక్కడ వసతి పొందుతున్నారు. బాత్రూములు పూర్తిగా శిథిలం కావడంతో విద్యార్థులంతా సామూహిక స్నానాలు చేయాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. దీనికి తోడు టాయిలెట్స్ కూడా పూర్తిగా పాడవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక పలువురు విద్యార్థులు చర్మవ్యాధులతో బాధపడుతున్నారు. చర్మవ్యాధులతో బాధపడుతున్న విద్యార్థులు మూడు, నాలుగు తరగతులలో ఇద్దరు, ఆరో తరగతిలో ఇద్దరు, 8 7 తరగతిలో ఇద్దరు చొప్పున ఉన్నారు. మెడికల్ క్యాంపులో పెట్టినప్పటికీ వీరికి చర్మ వ్యాధులు తగ్గలేదని 'ప్రజాశక్తికి వివరించారు. శిథిలమైపోయిన ఈ భవనం పూర్తిగా తొలగించి ఆధునిక భవనం నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు. అదేవిధంగా జూన్లో తెరిచిన హాస్టల్‌లో విద్యార్థులకు ఇప్పటివరకు దుప్పట్లు కూడా సరఫరా కాలేదు. గతంలో హాస్టల్ విద్యార్థులకు సబ్బులు, షాంపూలు, కొనుగోలు చేసేందుకు కాస్మొటిక్ ఛార్జీలు చెల్లించేవారు గత నాలుగైదు ఏళ్లగా వాటిని నిలిపివేశారు. అదేవిధంగా ఆదివారం అమలు చేయాల్సిన మెనూ కూడా సక్రమంగా అమలు కావడంలేదని విద్యార్థులు తెలిపారు. పురాతనమైన ఈ భవనాన్ని తొలగించకపోతే ఏ క్షణంలో కూలి పోతుందోనని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకువెళ్లిన నేటికీ ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రామచంద్రపురం బాలుర వసతి గృహం


మంచాలు లేక నేలపైనే కూర్చొన్న విద్యార్థులు

హాస్టల్ వార్డెన్ వివరణ

రామచంద్రపురం బాలుర వసతిగహం శిథిలావస్థలో ఉండటంతో పాటు టాయిలెట్స్, లేకపోవడంతో వార్డెన్ ఏడుకొండలను వివరణ కోరగా..టాయిలెట్స్ చాలా కాలం నుండి శిథిలావస్థతో చేరుకోవడంతో పాటు వాటికి డోర్లు పాడైపోయాయని తెలిపారు. విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. గత నెలలో ఎంపీ గంటి హరీష్ మాదుర్ తన నిధుల నుంచి రూ.5లక్షలు బాత్రూములకు మంజూరు చేశారని అన్నారు. అయితే ఆ సొమ్ములతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదని వార్డెన్ వివరించారు. అదేవిధంగా హాస్టల్ మరమ్మతుల నిమిత్తం నిధులు కేటాయించకపోవడంతో పనులు పూర్తి కాలేదన్నారు. హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు వచ్చాయని త్వరలో వాటిని పంపిణీ చేయాల్సి ఉందని ఆయన వివరించారు. ఇక్కడ హాస్టల్ భవనాన్ని పూర్తిగా తొలగించి ఆధునిక భవనం నిర్మించా వలసి ఉందని, దానికి సంక్షేమ శాఖ పరిశీలన చేసి ఎస్టిమేట్లు వేసి నిధులు మంజూరు చేయాల్సి ఉందని ఆయన వివరించారు.


శిథిలమైన హాస్టల్ గదుల్లోని కిటీలు

బాబూరావు మృతి తీరని లోటు

సిఐటియు ఆధ్వర్యంలో సంతాపసభ

ప్రజాశక్తి - అమలాపురం

రైస్‌మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు, తాడేపల్లిగూడెం మార్కెట్ జట్టు సంఘం నాయకులు చింతకాయల బాబురావు మృతి తీరని లోటని వివిధ ప్రజా సంఘాల నాయకులు అన్నారు. అక్టోబర్ 30న గుండె సంబంధిత సమస్యతో చింత కాయల బాబురావు మరణించారు. అమలాపురంలో శుక్రవారం సిఐటియు జిల్లా అధ్యక్షులు దుర్గాప్రసాద్ అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు దుర్గాప్రసాద్, ఐద్వా జిల్లా అధ్యక్షులు దైవకృప, అమూల్య తదితరులు చింతకాయల బాబూరావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాధారణ జట్టు కార్మికునిగా తన జీవితం ప్రారంభించి, తాడేపల్లిగూడెం కార్మిక ఉద్యమంలో కీలక నాయకుడిగా ఎదిగి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శిగా, జాతీయ కౌన్సిల్ సభ్యునిగా, ఏలూరు జిల్లా సిపిఎం కార్యదర్శిగా రైస్‌మిల్ కార్మికులకు, ఏలూరు జిల్లా ప్రజలకు అమూల్య మైన సేవలను చింత కాయల బాబురావు అందించారని తెలిపారు. కార్మికుల సమస్య పరిష్కారం అయ్యేంత వరకు తెగించి పోరాటాలు నిర్వహించగలిగే సామర్థ్యం కలిగిన నాయకుల్లో బాబురావు ఒకరని అన్నారు. ఆయన మరణం కార్మికోద్యమానికి తీరని లోటని కొని యాడారు. ఈ కార్యక్రమంలో సతీష్, నాగబాబు, పణిబాబు, ఈశ్వరి, దేవి, షేక్ అమిద్ ఉన్నిషా, మరియమ్మ, శంకర్ తది తరులు పాల్గొన్నారు.


బాబురావు చిత్రపటం వద్ద నాయకుల నివాళి

పోలీసుల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - రాజోలు

పోలీసుల సేవలు అభినందనీయని , మన రక్షణకోసం నిరంతరం పనిచేస్తూ మనకు అందుబాటులో ఉంటారని రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ అన్నారు. శుక్రవారం పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా విధి నిర్వహణలో అమరులైన పోలీసుల కుటుంబాలకు సంఘీభావంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఎంఎల్ఎ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదలాడకు చెందిన కోళ్ల వెంకన్న సిఆర్‌పిఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ ఛత్తీస్‌ఘడ్ ల్యాండ్ మైన్‌లో మృతి చెందారని వారి సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాజోలు సిఐ నరేష్‌కుమార్, మలికిపురం, సఖినేటిపల్లి ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఎ దేవ వరప్రసాద్

పెండింగ్ కేసుల దర్యాప్తునకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - అమలాపురం

పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తులో నాణ్యత, వేగం ప్రాధాన్యతగా భావించి ప్రతి కేసు దశలవారీగా పర్యవేక్షించాలి అని పోలీసు అధికారులను ఎస్పి రాహుల్ మీనా ఆదేశించారు. శుక్రవారం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఎస్పి రాహుల్ మీనా పోలీసు అధికారులతో కేసుల పెండింగ్‌నకు గల కారణాలు, నిందితుల అరెస్టు, నాన్ బెయిలబుల్ వారెంట్ అమలు, కేసుల దర్యాప్తు తదితర అంశాలపై నెల వారి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు సమావేశంలో అదనపు ఎస్పి ఎవిఆర్‌పిబి.ప్రసాద్, డిఎస్‌పిలు మురళికృష్ణ, ప్రసాద్, రఘువీర్ , ఇతర పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్

ప్రజాశక్తి - అయినవిల్లి

అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి దేవస్థానానికి నూతన ధర్మకర్తల మండలి నియామకం కొరకు శుక్రవారం నుంచి వెలువడిన ఉత్తర్వులు అనుసరించి ధర్మకర్తల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరడమైనదని సహాయ కమిషన్, ఇఒ సత్యనాయణ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకటన వెలువడిన తేదీ నుంచి 20 రోజులలోపు ఆసక్తి గలవారు పై దేవస్థానము కార్యాలయానికి దరఖాస్తులు అందజేయాలన్నారు.

కొనసాగిన రవికుమార్ దీక్ష

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నిరుపయోగంగా ఉన్న ఆర్‌టిసి బస్టాండ్‌ను వెంటనే పునరుద్ధరించి, బస్సులను నడపాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి చికురుమిల్లి రవి కుమార్ చేపట్టిన రిలే దీక్ష ఆరోగ్యం క్షీణిస్తున్నా యథావిధిగా కొనసాగింది. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక సమైఖ్యాంధ్ర శిబిరం వద్ద రవి కుమార్ చేస్తున్న రిలే దీక్ష శుక్రవారం 21 రోజు కొనసాగింది. ఈ దీక్షలో పాల్గొన్న పోతుల భారతి, సుందరరావులు సంఘీభావంగా దీక్షలో పాల్గొన్నారు.

ఘనంగా పొగాకు వ్యతిరేక దినోత్సవం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

వల్లూరు ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం అచ్యుతాపురం పిహెచ్‌సి ఆధ్వర్యంలో పొగాకు వ్యతిరేక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చిట్టూరి శ్రీధర్, పిహెచ్‌సి సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



విద్యుత్ శాఖకు రూ.16 కోట్ల నష్టం

- మొంథా తుపాను విధ్వంసం
- 3,561 విద్యుత్ స్తంభాలు నేలమట్టం
- యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టిన అధికారులు
- శుక్రవారం నాటికి 99 శాతం సరఫరాను పునరుద్ధరణ

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

మొంథా తుపాను కారణంగా జిల్లా స్థాయిలో విద్యుత్ శాఖకు సుమారు రూ.16 కోట్ల నష్టం వాటిల్లిందని అధికారులు ప్రాథమికంగా అంచనాలు వేశారు. మొంథా తుపాను చేసిన విధ్వంసానికి జిల్లా కాకావికలం కాగా, ప్రభుత్వం ముందుస్తు చర్యలు తీసుకోవడంలో ప్రాణ నస్థాన్ని నివారించగలిగారు. మామిడికుదురు మండలంలో ఒక మహిళ మృతి కాగా జిల్లాలో మరో ఇద్దరికి గాయాలయ్యాయి. మొంథా తుపాను ధాటికి భారీ వృక్షాలు, కొబ్బరి నేలమట్టం అయ్యాయి. వీటితో పాటు విద్యుత్ స్తంబాలు భారీగా నేలమట్టం కావడంతో విద్యుత్ శాఖకు భారీగా నష్టం వాటిల్లింది. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 68 సబ్ స్టేషన్ల పరిధిలో సుమారు 3,561లో విద్యుత్ స్తంభాలు నేలమట్టం కాగా, 11 కేవీ ఫీడర్లు 364, 465 విద్యుత్ కంట్రోలర్లు, 1900 కిలో మీటర్ల విద్యుత్ వైర్లు డ్యామేజ్ అయ్యాయని జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఇ రాజేశ్వరి మీడియాకు తెలిపారు.. రాజోలు నియోజకవర్గం అంతర్వేది వద్ద తుపాను తీరం దాటడంతో ఎక్కువగా ఈ మండలాలలో విద్యుత్ స్తంబాలు నేల మట్టమయ్యాయి. రాజోలు నియోజకరగ్మలో సుమారు 500 లో-టెన్షన్ విద్యుత్ స్తంభాలు నేల మట్టం కాగా, 80 కిలోమీటర్ల మేర విద్యుత్ కండక్టర్లు, విద్యుత్ తీగలను మార్చారు. ప్రభుత్వం ముదుస్తు చర్యల్లో భాగంగా మండలానికి 100 మందికి పైగా విద్యుత్ శాఖ సిబ్బందిని వివిధ జిల్లాల నుంచి తుపానుకు ఒక రోజే ముందే స్థానిక సఖినేటిపల్లి, మలికిపురం, రాజోలు మండలాలకు తరలించింది. తుపానుకు నేల మట్టమైన విద్యుత్ స్తంబాలను సమాచారం తెలిసిన వెంటనే యుద్ధ ప్రాతిప్రదికన పనులను నిర్వహించి 24 గంటలు గడవక ముందే, మండల హెడ్ క్వాటర్ గ్రామాలతో పాటు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా అందించారు. తొలిరోజు రాజోలు మండలంలో రెండు, మలికిపురం మండలంలో 6, సఖినేటిపల్లి మండలంలో 3 గ్రామాల మినహా అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయగా, తదుపరి రోజు 29న దాదాపుగా నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించినప్పటికీ కొన్ని లోతట్టు ప్రాంతాల్లో నీరు పూర్తిగా ఉన్న ప్రాంతాల్లో శుక్రవారం సైతం పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి.

సఖినేటిపల్లి మండలంలో సుమారు 100, మలికిపురం మండలంలో 150, రాజోలు, మామిడికుదురు మండలాలలో కలిపి 250 కు పైగా లో-టెన్షన్ విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయని విద్యుత్ శాఖ సఖినేటిపల్లి, మలికిపురం మండలాల ఎఇ ప్రసాద్ తెలిపారు. అలాగే సుమారు 50 ట్రాన్స్‌ఫార్మర్లు వరకూ నేలకొరిగాయన్నారు. ఇప్పటికే 99 శాతం విద్యుత్ సరఫరా అందించామని, మిగిలిన ప్రాంతాలకు శుక్రవారం సాయంత్రానికి పూర్తిస్థాయిలో సరఫరా అందిస్తామని ఆయన తెలిపారు.


తుపానుకు గొంది గ్రామం లో నేలకొరిగిన ట్రాన్స్ఫర్ తో పాటు ఎల్‌టీ స్తంభం

పాత స్తంభాలనే వినియోగిస్తున్నారు



ఒరిగిన విద్యుత్ స్తంభాల స్థానంలో చాలా చోట్ల పాతబడిన స్థంభాలనే తిరిగి వినియోగిస్తున్నారు. ఇప్పటికే డ్యామేజయిన స్థంబాల స్థానంలో కొత్తవి వేస్తే ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదు. పనుల్లో వేగం ఉన్నా నాణ్యత లేక పోవడం బాధాకరం. ఇదే కొనసాగితే ప్రమాదాలబారిన పడే అవకాశాలున్నాయి.

-కిషోర్ యెల్లమెల్లి, వైసిపి నాయకుడు, సఖినేటిపల్లి లంక

విద్యుత్ లేక అవస్థలు పడ్డాం



కాట్రేనిపాడులంక, గొల్లపాలెం కొన్ని గ్రామాల్లో మూడు రోజులు విద్యుత్ లేక అవస్థపడ్డాం. విద్యుత్ లేక తాగునీరు లేదు. మోటార్లు పనిచేయక ఇళ్లల్లో వాడకం నీరు సైతం లేక ఇబ్బందులకు గురయ్యాము. గ్రామస్తుల విద్యుత్ సిబ్బందిపై ఒత్తిడి పెంచడంతో ఎట్టకేలకు సరఫరా ఇచ్చారు.

-పండు మహాసేన, కాట్రేనిపాడు లంక గ్రామం


పేరూరులో శానిటేషన్ పనులు పర్యవేక్షిస్తున్న సర్పంచ్

వ్యాధులు వ్యాపించకుండా చర్యలు

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

మొంథా తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురవడంతో అంటు వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యగా అమలాపురం మండలం పేరూరు గ్రామ పరిధిలో శుక్రవారం శానిటేషన్ చేశారు. అందులో భాగంగానే పారిశుధ్య కార్మికులనే కాకుండా బయట వారిని కూడా పెట్టి బ్లీచింగ్ చల్లారు. ఈ శానిటేషన్ కార్యక్రమాలను గ్రామ సర్పంచ్ దాసరి అరుణ, వార్డు సభ్యులు, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, పంచాయతీ సిబ్బంది పర్యవేక్షించారు.



పనులు పర్యవేక్షిస్తున్న సర్పంచ్, కార్యదర్శులు

పి.గన్నవరంలో శానిటేషన్ పనులు

ప్రజాశక్తి - పి.గన్నవరం

మొంథా తుఫాన్ భారీ వర్షాల నేపథ్యంలో శుక్రవారం పి.గన్నవరం బాలయోగి కాలనీ లో శానిటేషన్ పనులు నిర్వహించి బ్లీచింగ్ చల్లించామని పంచాయతీ కార్యదర్శి ఎన్‌వివి.సత్యనారాయణ మూర్తి తెలిపారు. సర్పంచ్ బొండాడ నాగమణి పర్యవేక్షణలో కాలనీలో మురుగునీరు మళ్లింపు చర్యలు చేపట్టి మురుగు గుంటలలో ఎబెట్ స్ప్రే చేయించామని అన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే అంతా ఆరోగ్యంగా జీవించవచ్చని కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తుపాను బాధితులకు సాయం అందజేత


ఎస్. యానంలో బాధితులకు సాయం అందజేస్తున్న ఎంఎల్ఎ ఆనందరావు

ప్రజాశక్తి - యంత్రాగం

మొంథా తుపాను కారణంగా ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాల్లో ఉంటున్న తుపాను బాధితులకు శుక్రవారం ప్రజాప్రతినిధులు, అధికారులు ఆర్థిక సాయం, నిత్యావసరాలు అందజేశారు.

ఉప్పలగుప్తం: తుపాను బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు కోరారు. ఎస్.యానంలో తుపాను ప్రభావిత బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న రూ.3 వేలు నగదు, 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులను శుక్రవారం ఎంఎల్ఎ ఆనందరావు, రాష్ట్ర పౌరసరఫరాల అధికారి రోణంకి గోవిందరాజులు, జెసి టి.నిశాంతి ప్రారంభించి బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి అడపా ఉదయ్‌భాస్కర్, నియోజకవర్గ ప్రత్యేకఅధికారి, డ్వామా ఎపిడి డి.రాంబాబు,తహశీల్దార్,విఎస్ దివాకర్, డిప్యూటీ తహశీల్దార్ జి.లలిత, ఎంఆర్ఐ ఆర్.నాగూర్ మీరా సాహెబ్, రాష్ట్ర ఆక్వా కల్చర్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ లంకే భీమరాజు, డిసి ఛైర్మన్ దంగేటి చిట్టిబాబు, మాజీ సర్పంచ్ పినిశెట్టి నరసింహారావు, అయితాబత్తుల రాజశేఖర్,ఉలిశెట్టి దొరబాబు, పలచోళ్ళ బుజ్జి, సత్తి చిన్న తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: తుపాను నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన నగదు, నిత్యావసర సరుకులను నేలటూరు గ్రామంలో పునరావాస కేంద్రంలో ఉన్న బాధితులకు రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు అందించారు. 13 మందికి గాను 9 మందికి రూ.వెయ్యి చొప్పున, 4 కుటుంబాలకు రూ.3 వేలు చొప్పున పంపిణీ చేశారు. ఒక్కొక్క బాధిత కుటుంబానికి 25 కేజీలు బియ్యం, ఒక్కొక్క కేజీ చొప్పున కందిపప్పు, పంచదార, బంగాళా దుంపలు, ఉల్లిపాయలు, లీటరు వంటనూనెను అందజేశారు. తహశీల్దార్ శ్రీనివాస్, మండల ప్రత్యేకఅధికారి విజయలక్ష్మి, ఎంపిడిఒ భానూజీ రావు, ఎమ్ఎస్ఒ పద్మ, విఆర్ ఒ రాముడు, గ్రామ టిడిపి అధ్యక్షుడు ఆర్ సోమేష్, బొప్పా శ్రీనివాస్, వల్లూరి శ్రీనివాస్ చౌదరి, కడలి రాజు, నక్కా జనార్ధన్, కూటమి నాయకులు తదితరులు, పాల్గొన్నారు.


నేలటూరులో నగదు, నిత్యావసరాలు అందజేస్తున్న ఎంఎల్ఎ వేగుళ్ల

ఆత్రేయపురం: మొంథా తుపాను కారణం ఆత్రేయపురంలో పునరావాస కేంద్రంలో ఉన్న వారికి శుక్రవారం కొత్తపేట నియోజవర్గ ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, ఆర్‌డిఒ పి.శ్రీకర్ ఆర్థిక సాయం, నిత్యావసరాలు అందజేశారు. ఒక్కరు ఉంటే రూ.1000, కుటుంబానికి రూ.3 వేల చొప్పున సాయంతోపాటు నిత్యావసర సరుకులను ఎంఎల్ఎ, ఆర్‌డిఒ పంపిణీ చేశారు. అలాగే 76 మంది మత్యకార కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి 50 కేజీల బియ్యం, కందిపప్పు, పంచదార, ఆయిల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాడపల్లి ఆలయ ఛైర్మన్ ముదునూరి వెంకట రాజు, గ్రామ సర్పంచ్ గెడ్డం సుధా, తహశీల్దార్ టి.రాజేశ్వరరావు, ఆర్ఐ భాను, రేషన్ షాపు డీలర్లు పాల్గొన్నారు.. **రావులపాలెం:** మండల పరిధి ఊబలంకలో సర్పంచ్ కొక్కిరిగడ్డ లక్ష్మీ నరసింహం అధ్యక్షతన జరిగిన మత్యకారులకు నిత్యావసరాల కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఎంఎల్ఎ బండారు సత్యానందరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, గుత్తుల పట్టాబి రామారావు, మేడపాటి కాసురెడ్డి, రాజుగారు, తహశీల్దార్ బియం.ముక్తేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఆత్రేయపురంలో నిత్యావసరాలు, నగదు అందజేస్తున్న ఎంఎల్ఎ బండారు

పంటు పున:ప్రారంభం

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

సఖినేటిపల్లి లంక, నర్సాపురం మధ్య తిరిగి పంటు ప్రయాణం మొంథా తుపాను ప్రభావం తగ్గడంతో నాలుగు రోజుల తర్వాత శుక్రవారం తిరిగి ప్రారంభమయింది. తుపాను కారణంగా గత నెల 27వ తేదీ నుంచి గత నెల 30వ తేదీ వరకూ పంటు ప్రయాణం నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు గురైయ్యారు. తుపాను ప్రభావం తొలిగిపోవడం అధికారులు పంటు ప్రయాణాన్ని తిరిగి ప్రారంభించారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి - అయినవిల్లి

మొంథా తుపాను కారణంగా నష్టపోయిన రైతులను తక్షణమే ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని వైసిపి రాష్ట్ర బూత్ కమిటీ వింగ్ సెక్రెటరీ చేట్ల రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అలాగే పూరి గుడిసెలో ఉన్న పేదలకు, మత్స్యకారులను కూడా తక్షణమే ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

నేరాలు ఘోరాలు

రెండు ఇసుక లారీలు స్వాధీనం

ప్రజాశక్తి - కొవ్వూరు

సరైన పత్రాలు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న రెండు లారీలను జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. జిల్లా గనులు, భూగర్భ శాఖాధికారి డి.ఫణిభూషణరెడ్డి, ఇసుక టాస్క్ ఫోర్స్ అధికారి ఆంజనేయులు కొవ్వూరు, వాడపల్లి గ్రామాల్లో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ లారీలను గుర్తించి పట్టణ పోలీస్ స్టేషన్‌కి అప్పగించారు. ఇవే వాహనాలు ఈనెల 8న పట్టుబడినట్లు ఖమ్మం జిల్లా కల్లూరు సబ్ కలెక్టర్ లేక ద్వారా తెలిపారన్నారు. ఈ రెండు వాహనాలు గతంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం నుంచి తెలంగాణ రాష్ట్రం సత్తుపల్లి గుండా అక్రమ ఇసుక రవాణా చేసిన కేసుల్లో పట్టు బడినట్లు తెలిపారు. ఈ రెండు వాహనాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఫిర్యాదు చేసినట్లు జిల్లా మైన్స్ అధికారి ఫణిభూషణ్ రెడ్డి తెలిపారు.

తప్పిపోయిన మహిళల గుర్తింపు

ప్రజాశక్తి - జగ్గంపేట, కిర్లంపూడి

తప్పిపోయిన ఇద్దరు మహిళల ఆచూనీకి పోలీసులు గుర్తించారు. కిర్లంపూడి మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన 17 ఏళ్ల యువతి గత 28వ తేదీ నుండి కనిపించటం లేదని ఆమె తల్లి తండ్రులు పోలీసులకు పిర్యాదు చేశారు. వీరవరం గ్రామానికి చెందిన వివాహిత 4 ఏళ్ల బాబుతో గత 17వ తేదీ నుండి కనిపించడంలేదని ఆమె బంధువులు పోలీసులు ఫిర్యాదు చేశారు. ఆ రెండు పిర్యాదుల మేరకు వారి వివరాలను సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్ఐ సతీష్ బాబు, ట్రైనీ ఎస్ఐ రాజా సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించారు. వారు హైదరాబాద్‌లో వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నట్టు గుర్తించామని, వారిని తీసుకుని వచ్చి బంధువులకు అప్పగిస్తామని తెలిపారు.

సారా తరలిస్తున్న ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి-శంఖవరం

అన్నవరం శివారు మండపం వద్ద ఆటోలో సారా తరలిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ హరిబాబు తమ సిబ్బందితో గురువారం రాత్రి మండపం సెంటర్ హైవే దగ్గరలో దాడులు నిర్వహించగా ఆటోలో తరలిస్తున్న 72 లీటర్ల సారా తోపాటు నాలుగు బెల్లం బస్తాలను పట్టుకున్నారు. పెదమల్లాపురం వద్ద సారా తయారు చేస్తున్న బట్టీలపై దాడి చేసి సుమారు 1500 లీటర్ల బెల్లం ఉటతో పాటు సారా తయారీకి ఉపయోగించే వంట సామాగ్రిని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.



విద్యార్థినుల మాట్లాడుతున డిఇఒ

'పది'లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి - ఆలమూరు

మార్చి నెలలో జరగబోయే పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులతో నూటికి నూరు శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కషి చేయాలని డిఇఒ డాక్టర్ షేక్ సలీం బాషా అన్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల డాక్టర్ బొబ్బ జయశ్రీ బాలికోన్నత పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. అలాగే 10వ తరగతి విద్యార్థులతో మమేకమై విద్యార్థిల నుండి అనేక ప్రశ్నలు రాబట్టి విద్యార్థులకు తగు సూచనలు చేశారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం పాఠశాలలో జరిగే మధ్యాహ్న భోజనాన్ని, పాఠశాలలో రికార్డులు పాఠశాల ఆవరణను పరిశీలించారు. ఈయన వెంట ఎఎంఒ రాంబాబు, ఎంఇఒలు బి.అప్పాజీ, ఎన్.రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వల్లూరులో అక్రమంగా నిర్మించిన షెడ్డు తొలగింపు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

వల్లూరు గ్రామంలోని పంచాయతీ స్థలంలో అక్రమంగా షెడ్డు నిర్మాణం జరిగిందంటూ గ్రామ కార్యదర్శి సత్తిబాబు తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఒ భానూజీరావులకు ఫిర్యాదు చేశారు. దీనిపై శుక్రవారం పోలీస్ రెవెన్యూ అధికారులు సమక్షంలో షెడ్ ను తొలగించారు. కార్యదర్శి సత్తిబాబు తెలిపిన వివరాలు ప్రకారం వల్లూరు గ్రామపంచాయతీ పరిధిలో నిడసనమెట్టకు వెళ్లే రహదారి ప్రక్కనే ఉన్న సర్వే నంబర్205/6లో 9 సెంట్లు పంచాయతీ స్థలం ఉంది. ఆ స్థలంలో గతంలో దళిత సామాజిక వర్గీయులు అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఆ విగ్రహానికి చేర్చి గత నెల 20న మరల నూతనంగా షెడ్ నిర్మాణం చేశారు. ఆ స్థలం ప్రజల అవసరార్థం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మానానికి పంచాయతీ కేటాయించింది. పంచాయతీ అనుమతులు లేకుండా ఆ స్థలంలో అక్రమంగా షెడ్ నిర్మాణం జరిగినట్లు తన దష్టికి రావడంతో వెంటనే తహశీల్దార్, ఎంపిడిఒలు దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిపారు. ఆక్రమణ తొలగింపునకు తహశీల్దార్ పోలీసు రక్షణ కావాలంటూ అంగర ఎస్ఐ హరీష్ కుమార్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మండపేట రూరల్ సిఐ దొరరాజు ఆధ్వర్యంలో అంగర ఎస్ఐ జి.హరీష్ కుమార్, పోలీస్ సిబ్బందితో కలిసి బందోబస్తు ఏర్పాటు చేయగా పంచాయతీ అధికారులు ఆక్రముగా నిర్మించిన షెడ్డును తొలగించారు. కార్యక్రమంలో రాయవరం, ద్రాక్షారామం ఎస్ఐలు, మండపేట ట్రైనీ ఎస్ఐ సురేష్ బాబు, లక్ష్మణ బాబు, సోమేంద్ర, ఆర్ఐ అర్జమ్మ, పంచాయతీ రెవిన్యూ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు చేయూత

ప్రజాశక్తి - ఆత్రేయపురం

కూటమి ప్రభుత్వం డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు మరింత చేయూతనిస్తుందని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం ఆత్రేయపురం వెలుగు కార్యాలయంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. కార్యక్రమలో డిఆర్‌డిఎ జిల్లా నోడల్ అధికారి సాయి జయచంద్ర గాంధీ, లీడ్ బ్యాంక్ మేనేజర్ వర్మ, బ్యాంకు నోడల్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు

ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ

ప్రజాశక్తి - అంబాజీపేట

విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎంఎల్ఎ గిడ్డి సత్యానారాయణ అన్నారు. తొండవరం హైస్కూల్లో రూ.67లక్షల వ్యయంతో నిర్మించిన అదనపు తరగతి గదుల భవనాలను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యారంగంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. .ఈ అదనపు తరగతుల ద్వారా విద్యార్థులు సౌకర్యవంతమైన వాతావరణంలో చదువుకునే అవకాశం లభిస్తుందన్నారు. అలాగే పాఠశాలలో టెన్త్ క్లాస్ విద్యార్థి తయారు చేసిన రాకెట్ ప్రదర్శనను, విద్యార్థులు రూపొందించిన రోబోట్ ల నమూనాను ఎంఎల్ఎ ఆసక్తిగా వీక్షించి విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించి, మీ పాఠశాలకు తిరిగి సేవ చేయాలనే 'పేబ్యాక్ టు ది సొసైటీ' ఆలోచనతో ముందుకు సాగాలని సూచించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఆదర్శాలను స్మరించుకుంటూ ఆయన ఉన్నత విద్యను సాధించి దేశానికి రాజ్యాంగాన్ని అందించినట్లు మీరు కూడా విద్యతో సమాజానికి తోడ్పడాలన్నారు. అనంతరం మొంథా తుపాను బాధితులకు ఆర్థిక సహాయంగా ప్రతి బాధిత కుటుంబానికి రూ.3వేల నగదు, 25 కేజీల బియ్యం, అలాగే నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్‌పిటిసి సభ్యురాలు బూడిద వరలక్ష్మి, ఎఎంసి ఛైర్మన్ చిట్టూరి శ్రీనివాస్, తొండవరం, వాకలగరువు సర్పంచ్‌లు పేరరాబత్తుల రామలింగరాజు మద్దింశెట్టి సుబ్బారావు, రాష్ట్ర పారిశ్రామిక కార్పొరేషన్ డైరెక్టర్ మట్టపర్తి భారతి, ఎంపిటిసి సభ్యుడు వి.దొరబాబు, తహశీల్దార్ చినబాబు, ఎంపిడిఒ బి.మమత, రోహిణి హాస్పిటల్ వైద్య నిపుణులు మూర్తి, టిడిపి కో కన్వీనర్ డివివి.సత్యనారాయణ, అంబాజీపేట సొసైటీ అధ్యక్షులు అరిగెల సూరిబాబు, హైస్కూల్ కమిటీ ఛైర్మన్, సభ్యులు, హెచ్ఎం కేశవాచార్యులు, ఉపాధ్యాయులు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.




అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ గిడ్డి

వాటర్ గ్రిడ్ పైప్‌లైన్ ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి - అమలాపురం

జల జీవన్ మిషన్ కింద చేపట్టిన రూ1,650 కోట్లతో చేపట్టిన వాటర్ గ్రిడ్ పైప్ లైన్ ఏర్పాటు, రావుల పాలెం నుంచి అమలాపురం వరకు జాతీయ రహదారి విస్తరణ పనులకు ఆటంకం లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ వాటర్ గ్రిడ్ గుత్తేదారు మెగా ఇంజినీరింగ్, జాతీయ రహదారుల ఇంజనీర్లకు సూచించారు. శుక్రవారం స్థాని కలెక్టరేట్ నందు జాతీయ రహ దారుల ఇంజనీర్లు, మెగా ఇంజనీరింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ప్రాజెక్టు మేనేజర్తో జాతీయ రహదారి విస్తరణ వాటర్ గ్రిడ్ పైప్ లైన్ ఏర్పాటుపై కలెక్టర్ అధ్యక్షతన సమీక్షించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లా డుతూ ఇరు శాఖల ఇంజనీర్లు ముందుగా రోడ్డు విస్తరణ పైపులైన్ ఏర్పాట్లు పై 30 కిలోమీటర్లు సంయుక్త తనిఖీలు నిర్వహించి నివేదికలు రూపొందించి సమర్పించాలని ఆదేశం చారు. అదేవిధంగా జల వనరుల శాఖ ఇంజనీర్లు ద్వారా వంట కాలువలకు సంబంధించిన వివరాలను కూడా పరిగణనలో తీసుకొని నివేదికలు స్పష్టంగా రూపొందించాలన్నారు దిండి నుంచి సీతారాంపురం వరకు 22 కిలోమీటర్లు మేర చేపట్టనున్న నరసాపురం బైపాస్ రోడ్డు భూ సేకరణ దాదాపు పూర్తిగా వచ్చిందని ఒకే ఒక కోర్టు కేసు మాత్రమే పెండింగ్లో ఉందని రోడ్డు ఏర్పాటు పనులను ప్రారంభించాలని ఇంజనీర్లకు సూచించారు. లేనిప క్షంలో ఇబ్బందులు ఉత్ప న్నమయ్యే అవుతా యని ఆయన సూచించారు. నిర్మాణ పనులకు టెండర్లు పిలిచి అభివృద్ధి పనులను ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్, ఎస్ఇ ఎవిఎస్.రాజన్, ఆర్అండ్‌బి ఎస్ఇ బి.రాము, జాతీ య రహదారులు డివిజనల్ ఇంజినీర్ టి.నిఖిల్రాజ్, జూనియర్ ఇంజినీర్ ఎన్.శ్రీనివాస్, మెగా ఇంజినీరింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కంపెనీ ప్రాజెక్ట్ మేనేజర్ సు విశేషారావు, తదితరులు పాల్గొన్నారు.



మెగా ఇంజినీరింగ్ ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

పోలీసుల సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి - రావులపాలెం



మాట్లాడుతున్న ఎంఎల్ఎ బండారు

శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల సేవలు ప్రశంసనీయమని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, ఎస్పి రాహుల్ మీనాలు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంకెఆర్ ఫంక్షన్ హాల్లో పోలీసు అమరవీరుల దినోత్సవ వారోత్సవాలు నిర్వహించారు. దీనిలో భాగంగా జిల్లా పోలీసు యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎంఎల్ఎ, జిల్లా ఎస్పి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి అడ్మిన్ ఎవిఆర్‌పిడి.ప్రసాద్, డిఎస్‌పి సుంకర మురళీమోహన్, తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ కూటమి, ముత్యాల బాబ్జీ,గుత్తుల పట్టాభిరామారావు, సిఐలు శేఖర్‌బాబు, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



ఎంఇఒకు వినతి పత్రం ఇస్తున్న ఫ్యాప్టో ప్రతినిధులు

బోధనేతర పనులు చేపట్టేది లేదు : ఫ్యాప్టో

ప్రజాశక్తి- మామిడికుదురు

బోధనేతర కార్యక్రమాలు చేపట్టేది లేదని మండల ఫ్యాప్టో ప్రతినిధులు శుక్రవారం ఎంఇఒలు లక్ష్మీనారాయణ, వెంకన్న బాబులకు మెమొరాండం ఇచ్చారు. రాష్ట్ర ఫ్యాప్టో నిర్ణయం మేరకు జిల్లా ఫ్యాప్టో సూచనల మీద గత నెల 10వ తేదీ నుంచి బోధనేతర కార్యక్రమాలు బహిష్కరిస్తున్నామనే విషయాన్ని ఫ్యాప్టో మండల శాఖ పక్షాన మండల విద్యాశాఖాధికారికి ఇదివరకనే తెలియజేశామన్నారు. అయినప్పటికీ శుక్రవారం కొంతమంది సిఆర్ఎంటిలు ఉపాధ్యాయులకు ఫోన్ చేసి వీరగాథ కార్యక్రమం చేయాలని లేకపోతే ఎంఇఒలకు రాతపూర్వకంగా తెలియజేయాలని వత్తిడి చేస్తూన్నరన్నారు. ఈ చర్యను తాము ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర ఫ్యాప్టో నిర్ణయానికి కట్టుబడి ఉన్నామన్నారు.

శానిటేషన్ పనుల పరిశీలన

ప్రజాశక్తి - అయినవిల్లి

అయినవిల్లి మండలం తుపాను ప్రభావిత ప్రాంతాల్లో శుక్రవారం కొత్తపేట డివిజనల్ డెవలప్ మెంట్ అధికారి టిఆర్.రాజేశ్వర రావు పర్యటించారు ఈ సందర్భంగా గ్రామలలో జరుగుతున్న శానిటేషన్ పనులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపిడిఒ జి.సరోవర్, డిప్యూటీ ఎంపిడిఒ వాణి కుమారి బెహరా, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

జొన్నాడలో సర్పంచ్ ఆధ్వర్యంలో..

ప్రజాశక్తి - ఆలమూరు

తుపాను ప్రభావం వల్ల గ్రామాల్లో మురికినీరు చేరి రోగాల బారినపడకుండా ముందస్తు జాగ్రత్త చర్యలో భాగంగా గ్రామంలో బ్లీచింగ్ చల్లిస్తున్నట్లు సర్పంచ్ కట్టా శ్రీనివాస్ తెలిపారు. ఆయన ఆధ్వర్యం లో జొన్నాడ గ్రామపంచాయతీ పరిధిలో శుక్రవారం పారిశుధ్య కార్మికుల సహకారంతో బ్లీచింగ్ చల్లించారు. కార్యక్రమంలో కార్యదర్శి సుభాష్, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార ఘటనపై డిఎస్‌పి విచారణ

ప్రజాశక్తి - అమలాపురం

ఐ.పోలవరం మండలం బాణాపురంలో బాలికపై అత్యాచారం కేసును అమలాపురం డిఎస్‌పి టిఎస్ఆర్‌కె.ప్రసాద్ శుక్రవారం విచారణ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాలిక చెప్పిన వివరాల ప్రకారం రాయపురెడ్డి సత్య వెంకట కృష్ణ(బాబీ)పై కేసు నమోదు చేశామన్నారు. గ్రామంలో విచారణ చేశామని బాబీ స్పోర్ట్ పర్సన్ అని, ఇతను బాల బాలికలు వాలీబాల్ నేర్పుతాడన్నారు. స్కూల్ యాక్టివిటీస్‌లో కూడా తరచూ పాల్గొంటాడన్నారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఈ బాలికతో పాటు మరొక బాలికపై కూడా నిందితుడు బాబీ అత్యాచారం చేసినట్లుగా మా దృష్టికి వచ్చింది. వారు కూడా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మాపై ఎవరి ఒత్తిడి లేదన్నారు. బాబీ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, అతనిని వీలైనంత తొందరలో అదుపులోకి తీసుకుంటామన్నారు. అతను జనసేన పార్టీకి చెందిన వ్యక్తిగా గుర్తించామని డిఎస్‌పి అన్నారు. డిఎస్‌పి వెంట ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

ఆలమూరు: ఐ.పోలవరం మండలం బాణాపురంలో బాలికపై అత్యాచారం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా కార్యదర్శి రవికుమార్ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం మండల కేంద్రంలోని సమత కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

అమలాపురం- రాజమండ్రి నాన్ స్టాప్ సర్వీసులు ప్రారంభం

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురం నుంచి రాజమండ్రి నాన్ స్టాప్ నూతన సర్వీస్‌ను శనివారం ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు శుక్రవారం ప్రారంభించారు. నాన్‌స్టాప్ సర్వీసులో ప్రారంభించడంతో ప్రస్తుతం రాజమండ్రికి వెళ్లే సమయం కన్నా అతి తక్కువ సమయంలో రాజమండ్రి చేరుకునే అవకాశం ఉందని ఎంఎల్ఎ ఆనందరావు అన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు అందరూ వినియోగించు కోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, తిక్కారెడ్డి నేతాజీ, పెచ్చెట్టి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

అక్షరాస్యతపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - మామిడికుదురు

మండలంలోని కొమరాడ, మాకనపాలెం గ్రామాలలో మామిడికుదురు దీప్తి జూనియర్, డిగ్రీ కళాశాలలకు చెందిన జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) విద్యార్థులు ఆధ్వర్యంలో అక్షరాస్యతపై అవగాహనా ర్యాలీలు నిర్వహించారు.ఏడు రోజుల సేవా కార్యక్రమాలను ఆయా సర్పంచ్‌లు వలవల సత్యవేణి సత్యమూర్తి, మద్దాల బాబురావులు శుక్రవారం ప్రారంభించారు. దీనిలో భాగంగా మొదటి రోజు అక్షరాశ్యతపై అవగాహన కల్పించి, రెండు గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు జాతీయ సమైక్యత దినోత్సవం లో భాగంగా ఆయా గ్రామాలలో 2కే రన్ నిర్వహించారు ఈ కార్యక్ర మంలో పంచాయతి కార్యదర్శిలు దీపాటి సురేష్, ఎస్.నాగమణి, కళాశాల కరస్పాండెంట్ డివివి సత్యనారాయణ, ఎంపిటిసి వలవల పెదబాబు, ప్రిన్సిపల్ రంగారావు, ప్రోగ్రాం ఆఫీసర్లు ఆడబాల ఈశ్వరరావు, వాసంశెట్టి నాగరాజు, పొన్నమండ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో ఆర్‌డిఒ తనిఖీలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండల కేంద్రం ఆత్రేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కొత్తపేట ఆర్‌డిఒ పి.శ్రీకర్ తహశీల్దార్ టి.రాజేశ్వరరావుతో కలిసి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఏ విధమైన సేవలు అందిస్తు న్నారు. తదితర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల సిబ్బంది వ్యవహార శైలి ఎలా ఉంటున్నదని పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్ లో ఏ ఏ పరీక్షలు అందుబాటులో ఉన్నాయి అని ల్యాబ్ టెక్నీషియన్ అడిగారు. అనంతరం రి కార్డును పరిశీలించారు. వైద్యులకు పలు సూచన ఇచ్చారు.

బోట్ ఫెస్టివల్‌కు సన్నాహాలు చేయాలి

సంక్రాంతికి మూడు రోజులపాటు నిర్వహించే బోట్ ఫెస్టివల్ లో భాగంగా శుక్రవారం కొత్తపేట ఆర్‌డిఒ పి.శ్రీకర్ లొల్లలాకులు, తాడిపూడి బ్రిడ్జి, ఉచ్చిలి వద్ద సెంట్రల్ డెల్టా కాలువను పరిశీలించారు. గత సంవత్సరం సంక్రాంతికి నిర్వహించిన బోట్ ఫెస్టివల్ కంటే అదనంగా మరిన్ని కార్యక్ర మాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేయాలని తహశీల్దార్ టి.రాజేశ్వరరావును ఆదేశం చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ భాను, విఆర్ఒ పరంజ్యోతి పాల్గొన్నారు.

టిడిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఆత్రేయపురం శివారు నరసన్నపేట వాసులు 300 మంది అలాగే రజక పేటకు చెందిన పలు కుటుంబాలు, క్షత్రియ వర్గానికి చెందిన 10 కుటుంబాలు వారు వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయ ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు ఇంటి వద్ద ఎంఎల్ఎ బండారు సత్యానందరావు సమక్షంలో శుక్రవారం టిడిపిలో చేరారు. వీరికి ఎంఎల్ఎ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కూటమి నాయకలు పాల్గొన్నారు.

తుపాను బాధితులకు అండగా ప్రభుత్వం



పల్లం తుపాను బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు

ప్రజాశక్తి - కాట్రేనికోన

తుపాను బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు శుక్రవార పల్లం గ్రామంలో తుపాను బాధితులకు బియ్యం, నిత్యవసర వస్తువులు ప్రభుత్వం విప్ దాట్ల సుబ్బరాజు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సివిల్ సప్లై రాష్ట్ర డైరెక్టర్ ఆర్.గోవిందరాజు, జెసి టి.నిశాంతి , జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఉదయభాస్కర్ ,నాయకులు నాగేశ్వరరావు, నడింపల్లి సుబ్బరాజు, గుత్తుల సాయి, చెల్లి సురేష్ ,పిఎస్ఎన్రాజు, దండుప్రోలు సత్యం, సంఘాని వెంకటేష్, తాసిల్దార్ రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ అధికారుల తీరుపై ప్రభుత్వ విప్ ఆగ్రహం

విద్యుత్ శాఖ అధికారులు తీరుపై ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన స్వయంగా విద్యుత్ కార్యాలయానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. తుపాను ప్రమాదం పెద్దగా లేకపోయినా మూడు రోజులైనా కాట్రేనికోన మండలంలో విద్యుత్ సౌకర్యం పునరుద్ధరించక పోవడం, దీనిపై ప్రజలనుంచి తీవ్ర విమర్శ లు రావడం ఇవన్నీ కూటమి పార్టీల నాయకులు ఎంఎల్ఎ దృష్టికి తీసుకువచ్చారు. దీనితో ఎంఎల్ఎ సుబ్బరాజు కాట్రేనికోన మండల విద్యుత్ సబ్ స్టేషన్ కు చేరుకుని అధికారులు పని తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మండలం లో విద్యుత్ శాఖ సిబ్బంది పని తీరుపై ప్రజలనుంచి ఎక్కువగా ఆరోపణలు వస్తున్నాయని, పని తీరు మార్చుకోవాలని, ప్రజలకు జవాబు దారీగా ఉండలని పేర్కొన్నారు. ప్రభుత్వం తుపాను దృష్ట్యా అదనపు సిబ్బందిని ఇచ్చిన పనిచేయించలేక పోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసారు. సాయంత్రం లోగా విద్యుత్ పునరుద్ధరణ చేసి తీరాలని, లేకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకోవడం తప్పదని హెచ్చరించారు.

ప్రభుత్వం ఆదుకుంటుంది

ముమ్మిడివరం: మొంథా తుపానుకు నష్టపోయిన బాధిత కుటుంబాలను ప్రభుత్వమే అన్ని విధాలా ఆదుకుంటుందని ప్రభుత్వ విప్ మరియు ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. మండలంలోని అన్నంపల్లి పంచాయతీ పరిధిలో చింతపల్లి లంక గ్రామంలో శుక్రవారం తుపాను కారణంగా నష్టపోయిన మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం పంపిణీ చేసిన నిత్యావసర సరుకులను ఎంఎల్ఎ సుబ్బరాజు చేతులు మీదుగా అందజేశారు. అనంతరం ఒక్కొక్క మత్స్యకార కుటుంబానికి 50 కేజీల బియ్యం, కేజి నూనె, కేజీ పప్పు, కేజీ ఉల్లిపాయలు, కేజీ బంగాళాదుంపలు చొప్పున 45 కుటుంబాలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుత్తుల సాయి, గొలకోటి దొరబాబు, అర్థాని శ్రీనివాసరావు, పొద్దోకు నారాయణరావు, తాడి నరసింహారావు, గుద్దటి జమ్మి, చిక్కాల అంజిబాబు, పళ్ల రాజబాబు, కుంచనపల్లి నారాయణ, సొర్ర సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

561 మంది బాధితులకు..

ఆలమూరు: తుపాను ప్రభావంతో పునరావాస కేంద్రాలలో తలదాచుకున్న బాధితులను మండల పరిధిలో 18 గ్రామాలలో 561 మందిని లబ్ధిదారులుగా ప్రకటిస్తూ వారికి ఒకరు ఉంటే రూ.1000, ముగ్గురు కంటే ఎక్కువ ఉన్న కుటుంబానికి రూ.3 వేల చొప్పున మొత్తం రూ.4.95లక్షలు, నిత్యావసర సరుకులు మంజూరు అయినట్లు తహశీల్దార్ కెజె.ప్రకాష్‌బాబు శుక్రవారం తెలిపారు. మండలంలోని చెముడు లంక, మడికి పంచాయతీల వద్ద లబ్ధిదారులకు అధికారులు, ప్రతినిధులు, నాయకులు కలిసి శుక్రవారం నగదు, నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ నాగిరెడ్డి వెంకటేశ్వరరావు మాజీ సర్పంచ్ నాగిరెడ్డి వెంకటరత్నం, కొత్తపల్లి నగేష్, నాగిరెడ్డి సత్యానందం, కొత్తపల్లి రాంబాబు, సిరంగుల సతీష్, అడబాల వీర్రాజు, అడబాల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



చెముడులంకలో బాధితులు నగదు అందజేస్తున్న సొసైటీ ఛైర్మన్ వెంకటేశ్వరరావు